క్లుప్తంగా

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి,పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

19న శనీశ్వర జయంతి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ సన్నిధిలో ఈనెల 19వ తేదీన శనీశ్వర జయంతి సందర్భంగా దోష పరిహార పూజలు చేస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు సోమవారం తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్రతీర్థ శ్రీపాదులవారి ఆదేశాల మేరకు శనీశ్వర స్వామి వారికి శాంతిహోమం, తైలాభిషేకం నిర్వహిస్తామన్నారు. శనీశ్వర ప్రభావం వల్ల వివాహం ఆలస్యం అగుట, నిరుద్యోగం, ఉద్యోగ సమస్యలు, మానసిక అశాంతులు, ఆర్థిక సమస్యలు, శత్రుభయం, నరదృష్టి ఇలాంటి దోషాలకు పరిహార పూజలు చేపడుతున్నట్లు చెప్పారు. పరిహార పూజలు జరిపించుకునేందుకు ఆసక్తి కలిగిన వారు 99857 06489 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జయప్రదం చేయండి



చిన్నతుంబళంలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

పెద్దకడబూరు: ఈనెల 22న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కన్న, రైతు సంఘం నాయకుడు పరమేష్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో సోమవారం ఉపాధి పని ప్రదేశంలో కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీటి వసతి, మెడికల్ కిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి కూలీల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని అధిక సంఖ్యలో కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు హనుమంతు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కోసిగి: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ అయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాణిక్యరాజు సూచించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మేజర్ పంచాయతీ పరిధిలో పనిచేసే 45 మంది కార్మికులకు పరిశుభ్రత కిట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామం అంతటా డ్రయినేజీలు, రోడ్లు, నీటి ట్యాంకులు శుభ్రం చేసే కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పంచాయతీ తరఫున నెలకు రెండు జతల సబ్బులు, కొబ్బరి నూనె, ఏడాదికి రెండు జతలు యూనిఫాంలు అందజేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ కోతలపై సమాచారం ఇవ్వాలి

ఆదోని రూరల్: విద్యుత్ కోతలపై ఆ శాఖ ప్రకటన విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్‌దోకా కోరారు. వారు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. విద్యుత్ కోతల సమయాన్ని తప్పనిసరిగా ప్రజలకు తెలియజేస్తూ, సకాలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని, లేనిపక్షంలో విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ముందు ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు, నాయకులు సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

రచ్చమర్రిలో డీఎస్పీ పర్యటన

మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చమర్రి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్ బాబు సోమవారం పర్యటించారు. గ్రామానికి చెందిన వ్యక్తులు అధిక వడ్డీలకు డబ్బులిచ్చి మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈయనతో పాటు ఎస్‌ఐ కిరణ్ తదితరులు ఉన్నారు.

స్పందన సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



స్పందన కార్యక్రమంలో అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారం రోజుల్లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. రీసర్వేలో ఏదైనా సమస్యలు వస్తే సంవత్సరంలోపు ఆ మండలానికి సంబంధించి మొబైల్ మెజిస్ట్రేట్ లేదా రీసర్వే ఉప తహసీల్దార్‌కు అప్పీలు చేసుకోవచ్చన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని..

- హొళగుంద మండలం నెరణికి చెందిన మహబూబ్‌పీరా బాషాకు సర్వే నంబర్ 495లో స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. వాటికి సంబంధించిన పట్టా డూప్లికేట్, నకలు లేదా పొజిషన్ పట్టా మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణానికి చెందిన ఆనంద్‌బాల తన సొంతమైన నందవరం మండలం పెద్దకొత్తపల్లి గ్రామంలో సర్వే నంబర్ 181/బీ1లో 4.90 ఎకరాల భూమిని సర్వేచేసి హద్దులు చూపాలని అర్జీ సమర్పించారు.
- నందవరం మండలం పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన జి.ముత్తన్నకు సంబంధించి సర్వేనంబర్ 165/7లో 1.06 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించాడు.
- నందవరం మండలం సోమలగూడూరులో దేవదాయ భూమికి సంబంధించి సర్వేనంబర్ 58లో 13.39 ఎకరాలు, సర్వేనంబర్ 57లో 3.84 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సోమలగూడూరుకు చెందిన రామన్న అర్జీ సమర్పించారు.

స్పందన కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ వలిబాషా, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోని టౌన్: వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడమే స్పందన లక్ష్య మని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారు ఆధార్ నంబర్ పొందుపరచాలన్నారు. తన స్థలాన్ని ఆక్రమించారని,వాటిని తొలగించి న్యాయం చేయాలని హనుమంతమ్మ, రమేష్ దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్ను విధించాలని మరో ఇద్దరు గోపాల్‌కృష్ణ, తిమ్మప్ప అర్జీలు ఇచ్చారు. తడి–పొడి చెత్తను వాహనంలో తీసుకెళ్లడంలేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మురుగు కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయని, మరమ్మతులు చేపట్టాల ని నారాయణశెట్టి అర్జీ పెట్టుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి వెనువెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ భరోసా ఇచ్చారు. ఇంజినీరింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, రెవెన్యూ, టీపీఓ, జనన, మరణ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

దారి మూసివేత పనులు నిలిపివేయాలి



రైల్వే ఎస్‌ఐ లక్ష్మన్నతో మాట్లాడుతున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం: రహదారి మూసివేత పనులను ఆపాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండల పరిధిలోని తుంగభద్ర, కాచాపురం గ్రామాలకు తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ నుంచి పట్టాలను దాటుకుని వెళ్లేవారు. అయితే దారిని మూసివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు వై.ప్రదీప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, శీనన్న తదితరులు సోమవారం సాయంత్రం రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుని రైల్వే ఎస్‌ఐ లక్ష్మన్నతో మాట్లాడారు. ఇప్పటికే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరైందని, త్వరలోనే టెండర్లు పూర్తవుతాయని అంత వరకు నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే ఎస్‌ఐ లక్ష్మన్న హామీ ఇచ్చారు.

నేరాల నియంత్రణపై సమీక్ష



సీఐ, ఎస్‌లతో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

ఆదోని అర్బన్: నియోజకవర్గ పరిధిలో నేరాల నియంత్రణపై సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శివనారాయణస్వామి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని రూరల్, అర్బన్ పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులపై త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి అణచివేయాలని సూచించారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని డీఎస్పీ బంగ్లా నుంచి ధణాపురం వరకు బీటీ రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. రూ.7.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మా ణం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. రోడ్డు ఏర్పాటుతో చుట్టుపక్కల గ్రామాలైన ధణాపురం, కల్లుబావి, వైఎస్సార్ నగర్, భీమిరెడ్డి నగర్, నారాయణపురం, జగనన్న కాలనీలకు ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే చెప్పారు. ఆ మార్గంలో గ్రావెల్ రోడ్డు ఉండేదని ప్రస్తుతం బీటీ రోడ్డు వేయడం వల్ల రాకపోకలకు మరింత అనుకూలంగా ఉంటుందన్నారు. త్వరితగతిన గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. పట్టణం నుంచి రాకపోకలు నిర్వహించాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఈ రోడ్డు గుండా వీలైనంత త్వరగా వెళ్లవచ్చన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.2,100 డీడీలు కట్టిన ప్రతిఒక్కరికీ ఇంటి పట్టా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మండగిరి లేఅవుట్ జగనన్న కాలనీలో 10,100 పట్టాలు, ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. పట్టణాధ్యక్షుడు దేవా, 22వ వార్డు ఇన్‌చార్జ్ నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ ఉస్మాన్‌బాషా, కాంట్రాక్టర్ చెన్నారెడ్డి, నాయకులు,కార్యకర్తలు,ఇంజనీరింగ్‌అధికారులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



డ్రయినేజీ కాల్వ ఏర్పాటు చేసిన దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలోని నాడుగేని వీధిలో చైతన్య స్కూల్ నుంచి శ్మశాన వాటిక వరకు ప్రధాన డ్రైనేజీ కాల్వను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో నిర్మించారు. పైప్రాంతాల నుంచి వర్షపు నీరు, డ్రైనేజీ మురుగు నాడుగేని వీధికి చేరి రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతూ ఉండేది. శ్మశాన వాటికకు వెళ్లేందుకు సైతం ప్రజలు డ్రయినేజీ నీటిలోనే వెళుతూ తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను స్థానిక ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో 195 మీటర్లు డ్రైనేజీ పనులు పూర్తి చేయించారు. గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కేసు కొట్టివేత

కోసిగి: 2019 ఎన్నికల అనంతరం టీడీపీ నాయకులపై వైఎస్సార్ సీపీ నాయకులు మఠం బ్రదర్స్ మహంతేష్ స్వామి, జగదీష్ స్వామి అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డారన్న అభియోగానికి సంబంధించిన కేసును సోమవారం ఆదోని కోర్టు కొట్టివేసింది. నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేశారు. కేసు నంబర్ 136/2019లో కోసిగి టీడీపీకి చెందిన హోటల్ వీరేష్, మరో ఇద్దరు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మఠం బ్రదర్స్, అనుచరులపై దాడి కేసు పెట్టారు. ఈ కేసు సోమవారం తుది విచారణకు రాగా కోర్టులో సాక్షాధారాలు రుజువు చేయలేక పోవడంతో కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

రైతు భరోసా జాబితా సిద్ధం



నదిచాగి గ్రామంలో జాబితాలో పేర్లు చూసుకుంటున్న రైతులు

కౌతాళం: వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి సూచించారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల సచివాలయాల వద్ద రైతు భరోసా అర్హుల జాబితాలను నోటీసు బో ర్డులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులై ఉండి జాబితాలో పేర్లు లేకపోతే లేదా కొత్తగా పేర్లు నమోదు చేసుకోవాలనుకున్న రైతులంతా ఈనెల 18వ తేదీలోగా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల ఆఖరులోగా తుది జాబితా సిద్ధమవుతుందని తెలిపారు.

గడప గడపలో విశేష స్పందన



వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన విశేష లభిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సోగళహాళ్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో లబ్ధిదారులకు మంజూరైన సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు ప్రదీప్‌రెడ్డిని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న వై.ప్రదీప్‌రెడ్డికి స్థానికనాయకులు గజమాల వేసి సన్మానించారు. ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ట్రస్టు సభ్యులు లక్ష్మిరెడ్డి, సర్పంచ్ రాధమ్మ, ఎంపీటీసీ ఈరన్న, సాయినాథ్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం,కేవీపీఎస్ నాయకులు

ఆదోని రూరల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే కూలీలకు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కుప్పగల్లు, సంతేకూడ్లూరు గ్రామాల్లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. కుప్పగల్, సంతేకుడ్లూరు గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఇప్పటికే ఐదు వారాలకు పైగా ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లుల చెల్లింపులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బిల్లులను విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో కూలీలతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈనెల 22వ తేదీన ఉపాధి కూలీలతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేపడతామన్నారు. ఉపాధి కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు



సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలతతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ

ఆదోని టౌన్: ఆదోని మాతా శిశు సంరక్షణ (స్త్రీలు, చిన్నారుల ఆస్పత్రి) కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్ రెడ్డి సోమవారం ఆస్పత్రికి చేరుకుని సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలతతో కలిసి మరుగుదొడ్ల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. గర్భిణులు, బాలింతలు, వారికి సహాయకులుగా వచ్చే మహిళలకు అనువుగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు.

ఎరువులు సిద్ధం

కౌతాళం: మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువలు స్టాక్ సిద్ధంగా ఉందని వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలోని 23 రైతు భరోసా కేంద్రాలకు యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఎంఆర్‌పీ ధరలకే పొందవచ్చునన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 4 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు పంపిణీ చేయడానికి టార్గెట్ పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

విచారణాధికారి నియామకం

ఆదోని అర్బన్: జింకలను వేటాడి చంపిన కేసుకు సంబంధించి విచారణాధికారిగా కర్నూలు జిల్లా అటవీ శాఖ అధికారి శివశంకర్ రెడ్డిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆదోని రేంజ్ అటవీ క్షేత్రాధికారి ఎస్.రామచంద్రుడు సోమవారం విలేకరులకు తెలిపారు. 2022 మార్చి 6న ఆదోని రేంజ్ ఆలూరు సెక్షన్ పరిధిలోని నెరణికి తూర్పు బీట్‌లోని కమ్మరచేడు, నారాయణపురం గ్రామ పొలాల మధ్య 11 జింకలను వేటాడి చంపిన కేసుకు సంబంధించి విచారణ జరిపేందుకు ప్రభుత్వం కర్నూలు జిల్లా అటవీశాఖాధికారి శివశంకర్ రెడ్డిని నియమించిందన్నారు. ఈ కేసుకు సంబంధించి ఏదైనా సమాచారం రాతపూర్వకంగా కానీ లేదా మౌఖికంగా గానీ ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదోని అటవీ క్షేత్రాధికారి ఆదోని కార్యాలయంలో హాజరై తెలపవచ్చన్నారు.

ఆటలమ్మను నివారిద్దాం

- వేసవిలో వ్యాపిస్తున్న వైరస్
- చిన్నపిల్లల్లో అధికం
- నాటు వైద్యానికి దూరముంటే మేలు

హొళగుంద: వేసవిలో చిన్నపిల్లలకు ప్రధానంగా ఆటలమ్మగా పిలిచే తట్టు వ్యాధి ఎక్కువగా సోకుతుంది. దీన్ని అమ్మోరు.. చికన్‌పాక్స్.. ఆటలమ్మ.. తట్టు పేర్లతో కూడా పిలుస్తారు. వేసవిలో చిన్న పిల్లల్లో శరీరంలో ఉష్ణోగ్రత పెరగడం వల్ల ఒక రకమైన వైరస్ కారణంగా ఈ వ్యాధి సోకుతుంది. సాధారణంగా 2–12 ఏళ్ల వయసున్న పిల్లలకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. పెద్దలకు అరుదుగా వస్తుంది. ఎలాంటి హాని కలిగించని ఈ వ్యాధి ఐదారు రోజలకు దానంతటదే తగ్గిపోతుంది. నూటిలో ఒకరిద్దరికి కొద్దిగా ప్రభావం చూపుతుంది తప్పా ప్రమాదకరమైన వ్యాధి కాదు. వ్యాధి సోకిన సమయంలో కొన్ని జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది.

ఆటలమ్మ వ్యాధి ఎలా సోకుతుంది, దాని లక్షణాలు

ప్రధానంగా రెండేళ్లపై బడిన పిల్లలకు ఈ వ్యాధి సోకుతుంది. శరీరంపై నీటి పొక్కులు, ఎర్రటి గుల్లలు వస్తాయి. అంతకు ముందు కళ్లలో నీరు కారడం, నలుసు రావడం జరుగుతుంది. శరీరంపై లేచిన గుల్లలు మంట, దురదగా ఉంటాయి. జ్వరం, ఆకలి మందగించడం, దగ్గు దీని లక్షణాలు. చిన్నగా మొదలై శరీరం మొత్తం గుల్లలు, దద్దర్లు లేస్తాయి. ఇంట్లో ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధి ప్రభావం–తీసుకోవలసిన జాగ్రత్తలు

వ్యాధి సోకినప్పుడు కొద్ది రోజులు పిల్లలు సరిగా ఆహారం తీసుకోలేరు. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. పిల్లలు నీరసంగా ఉంటారు. వీరికి మెత్తని ద్రవ పదార్థాన్ని ఇవ్వాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగించాలి. శరీరంపై నీరు, చీము గుళ్లలు, ర్యాష్‌ల వల్ల కలిగే మంట నుంచి ఉపశమనం కలిగించడానికి గోరువెచ్చని నీటితో తుడుస్తూ ఉండాలి. వీరికి ప్రత్యేకంగా గది, దుస్తులు, బెడ్, సబ్బు ఉంచాలి. బయట గాలికి తిరగరాదు. ఐదారు రోజులు ఇలాగే చేస్తుంటే గుల్లలు తగ్గిపోతాయి. పత్యం ఉండాల్సిన అవసరం లేదు. 15 రోజులు దాటి అలాగే ఉంటే వెంటనే పిల్లలను పిడియాట్రిక్, గర్భిణులను గైనకలాజిస్టుల వద్ద చూపించడం మంచిది. వ్యాధి ఉన్న కొద్ది రోజులు జ్వరం తగ్గడానికి, మచ్చలు పోవడానికి మందులు వాడాల్సి ఉంటుంది. ఆర్‌ఎంపీలు, అనుభవం లేని వైద్యుల వద్ద చికిత్స చేయించరాదు.

ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్

చికెన్‌పాక్స్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే సరఫరా లేకపోవడంతో పీహెచ్‌సీలలో వ్యాక్సిన్లు వేయడం లేదు. దానికి బదులుగా మ్యూజీవల్స్ వేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, హెల్త్ సబ్ సెంటర్‌లో కూడా వేయాల్సి ఉంది. 12–18 నెలల పిల్లలకు మొదటి విడత, 4–6 ఏళ్ల వారికి రెండో విడత తట్టు నివారణ వ్యాక్సిన్ (వరివాక్స్)లు వేయాలి. దీంతో 90 శాతం మందికి చికెన్‌పాక్స్ రాదు. వ్యాక్సిన్ వేయించుకున్న వారు వ్యాధి వచ్చిన వారి నుంచి దూరంగా ఉండాలి.

పసరు తాగించడం మంచిది కాదు

గ్రామీణ ప్రాంతల్లో చికెన్‌పాక్స్‌ను తట్టుగా పిలుస్తారు. ఈ వ్యాధి నయం అయ్యేంత వరకు పాత సాంప్రదాయాన్ని పాటిస్తుంటారు. వ్యాధి సోకిన పిల్లలకు పల్లెల్లో వేపాకుల నీటితో స్నానం చేయించడం, పసరు తాగించడం జరుగుతుంది. పసరు తాగించడం మినహాయించి వేపాకు నీళ్లతో స్నానం చేయించడం, శరీరంపై వేపాకులు కప్పడం మంచిదే. యాంటీబయాటిక్ మాదిరిగా పనిచేస్తూ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించి ఇలాంటివి చేయాలి. ప్రమాదకర వ్యాధి కాకపోవండతో భయపడాల్సిన అవసరం లేదు. చిన్న పిల్లలు కావడం వల్ల వ్యాధి వచ్చిన ఆ కొద్ది రోజులు జాగ్రత్తలు పాటిస్తే చాలు. ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, దేవనకొండ మండలాల్లో ఈ వ్యాధి తీవ్రత ఉంది. అయితే ఆరోగ్య కేంద్రాలలో తక్కువగా కేసులు నమోదు అవుతుంటే అనధికారికంగా ఇళ్లలోనే వ్యాధి తగ్గించుకుంటున్నారు. వ్యాధి సోకిన పిల్లలను ఇళ్ల వద్ద ఉంచి అనాదిగా చేసుకొస్తున్న సాంప్రదాయాలను పాటిస్తున్నారు. డాక్టర్ల వద్దకు తీసుకెళ్లడాన్ని ఇక్కడి ప్రజలు అరిష్టంగా భావిస్తారు. దీనివల్ల వ్యాధిగ్రస్తుల సంఖ్య తేలడం లేదు.



శరీరంపై ఆటలమ్మ పొక్కులు

ప్రాణాంతకం కాదు



చికెన్‌పాక్స్ ప్రాణాంతక వ్యాధి కాదు. వ్యాధి లక్షణాలను బట్టి మందులు ఇస్తే తగ్గిపోతుంది. కొద్ది రోజులుండి పోయే ఈ వ్యాధి అరుదుగా బ్యాక్టీరియల్ వైరల్‌గా మారుతుంది. అటువంటి సమయంలో వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సలహాలను పాటిస్తే ఏ ఇబ్బంది ఉండదు. నాటు వైద్యాన్ని సంప్రదించడం, పసరు తాగించడం మంచిది కాదు.

– న్యూటన్, వైద్యాధికారి, హొళగుంద పీహెచ్‌సీ

బస్సు సౌకర్యం కల్పించండి

పెద్దకడబూరు: మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి దేవదాసు కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలు ఉంటేనే బస్సులు నడుపుతున్నారని, లేని పక్షంలో బస్సు సర్వీసులను నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

రైతు భరోసా దరఖాస్తుకు 18 వరకు గడువు

మద్దికెర: 2023–24 సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా పథకానికి ఈ నెల 18వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏఓ హేమలత సోమవారం తెలిపారు. అర్హత ఉండి పథకం లబ్ధిపొందని వారు, ఇంతవరకు దరఖాస్తు చేసుకోని వారు ఉంటే ఈనెల 18వ తేదీ లోపల స్థానిక రైతు భరోసా కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు అందించి ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.